సాక్షి చిత్తూరు

శుక్రవారం ¡ 20 ¡ సెప్టెంబర్ ¡ 2024



'యాళి'పై వరసిద్ధుని చిద్విలాసం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయకుడు గురువారం రాత్రి యాళి వాహనంపై విహరించారు. - 8లో



జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. - 8లో



ఉపాధిలో యథేచ్ఛగా దోపిడీ

పూతలపట్టు మండలంలో కూటమి నేతలు ఉపాధి పనులను యంత్రాలతో చేస్తూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అందుబాటులో ఉచిత ఇసుక బుకింగ్ పోర్టల్



కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. రాష్ట్ర భూగర్భ గనుల శాఖ అధికారులు గురువారం విజయవాడ నుంచి ఉచిత ఇసుక పోర్టల్‌ను వర్చువల్‌లో ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, మైనింగ్ అధికారులు వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇకపై ప్రజలు ఇసుక కోసం ఆన్‌లైన్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో బుక్ చేసుకోవచ్చన్నారు. ఇసుకను పారదర్శకంగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సీసీ కెమెరా, డ్రోన్లతో పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఎవరు ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటారో వారికి ముందుగా ఇసుక పంపిణీ చేస్తామని వెల్లడించారు. డిమాండ్‌కు తగినట్టు ఇసుక సరఫరా చేసేలా స్లాట్లను రూపొందిస్తున్నామన్నారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో జిల్లా మైన్స్ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జాయింట్ కమిషనర్ రమేష్‌కిషోర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఏపీవీపీ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ తనిఖీ చేశారు. ఆస్పత్రి పనితీరు, అత్యవసర విభాగం, ఓపీడీ బ్లాక్, ల్యాబ్, ఈఎన్‌టీ, ఐపీడీ, డయాలసిస్ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై ఆస్పత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అపోలో, ప్రభుత్వ ఆస్పత్రి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేద విద్య నిరుద్యోగ భృతికి దరఖాస్తులు

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారు నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. భృతి కింద రూ.3 వేలు అందజేస్తామని తెలిపారు. ఇందుకు వేద విద్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీలు, ఎలాంటి ఉద్యోగం లేదని స్వీయ ధ్రువీకరణ పత్రం అందజేయాలని సూచించారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులను చిత్తూరు నగరంలోని దేవదాయశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ

బంగారుపాళెం: బంగారుపాళెంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను గురువారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం మంత్రి కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జేసీ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమం సజావుగా సాగేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ శివశంకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు



ఏ ప్రభుత్వమైనా ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అలాంటిది ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య విభాగాన్ని నీరుగారుస్తోంది. వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలన్న అనాలోచిత నిర్ణయంతో పేదలకు వైద్య విద్యను దూరం చేస్తోంది. రాష్ట్ర వాటాగా వచ్చిన మెడికల్ సీట్లను వద్దని వెనక్కి పంపించడం ఎంతవరకు సబబు. దీంతో డాక్టర్ కావాలన్న ఎంతో మంది పేద విద్యార్థుల కల నెరవేరకుండా పోతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మెడికల్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లినట్టు అయింది.

– పురుషోత్తం, బీఎస్సీ విద్యార్థి



పేద విద్యార్థులు వైద్య విద్య చదవకూడదా



మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేట్‌పరం చేయాలని నిర్ణయించడం దారుణం. అలా చేస్తే పేద, మధ్య తరగతి పిల్లలు రూ.కోట్లు చెల్లించి వైద్యవిద్య ఎలా చదువుకుంటారు. పేద విద్యార్థులు డాక్టర్లు కాకూడదని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్టుంది. నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలున్నాయి. ఇది మొత్తం రాష్ట్రానికి నష్టం కలుగజేస్తుంది. బోధనాస్పత్రుల ద్వారా పేదలకు అందే వైద్యం కూడా అందకుండా పోతుంది. ప్రభుత్వం సేవా దృక్పథంతో ఆలోచించాలి.

– భరత్, బీఎస్సీ విద్యార్థి

వంద రోజులుగా వంచన

తిరుపతి, చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు గొప్పగా ప్రకటించుకున్నారు. అయితే ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సూపర్ సిక్స్.. మీ జీవితాల్లో వెలుగులు ఫిక్స్.. ఇది మా హామీ. మెగా డీఎస్సీ.. నిరుద్యోగులకు సర్కారు కొలువు ఖాయం. ఇంటింటికీ ఓ ఉద్యోగం, ఉపాధి చూపకపోతే భృతి అందజేస్తాం. ప్రతి మహిళనూ లక్షాధికారిని చేస్తాం.. చేనేతకు చేయూత నిస్తాం.. మత్స్యకారులకు మేలు చేస్తాం.. ఒకటేమిటి అదీ, ఇదీ అన్నీ చేస్తామంటూ నాడు కూటమి బాస చేసింది. అంతవరకు సంబరమే.. అయితే గద్దెనెక్కి వందరోజులు పూర్తయినా ఒకంటే ఒకేటే అమలుకు నోచుకుంది. మిగిలిన హామీలన్నీ మాయమయ్యాయి.



కుప్పానికి మీరిచ్చిన వరాలు గుర్తున్నాయా బాబూ?

2024 మార్చి 25న కుప్పం బహిరంగ సభలో చంద్రబాబు..

- కుప్పానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తాం.
- ప్రతి మహిళకూ రెండు పాడి ఆవులు ఇస్తాం.
- ప్రతి మండలంలోనూ ఒక పరిశ్రమ స్థాపిస్తాం.
- హంద్రీ నీవా కాలువ పూర్తి చేసి కుప్పానికి నీరు తెస్తాం.
- బెంగళూరు నుంచి కుప్పానికి గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేస్తాం.
- కుప్పం నుంచి పలమనేరుకు ఫోర్ లైన్ హైవే నిర్మాణం చేపడతాం.
- విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
- ప్రతి మండలానికీ కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తాం.
- ప్రతి మండలంలోనూ కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి విదేశాలకు కూరగాయల ఎగుమతికి అవకాశం కల్పిస్తాం.
- కుప్పం పట్టణాన్ని శాటిలైట్ టౌన్ షిప్‌గా మారుస్తాం.
- నియోజవర్గంలోని 10 ప్రధాన దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు.
- కుప్పం మున్సిపాలిటీకి రూ.250 కోట్లు కేటాయించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.
- మేజర్ పంచాయతీకి రూ.2 కోట్లు, మైనర్ పంచాయతీ రూ.కోటి అధికంగా నిధులు కేటాయిస్తాం.
- కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శంగా మారుస్తాం.

హామీలు కోకొల్లలు.. అమలు ఒకే ఒకటి

- సూపర్ సిక్స్ పక్కనపెట్టారు..
- కుప్పానికి ప్రత్యేక బడ్జెట్ లేదు.. రూ.250 కోట్లు ఇవ్వలేదు
- కుప్పం– బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే ఒట్టి మాటలే కదా? బాబు గారూ
- టమాట, కూరగాయల నిల్వకు ప్రతి మండలానికీ ఓ కోల్డ్ స్టోరేజ్ ఊసేలేదు
- బంగారుపాళెంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు హామీని మాత్రం నిలబెట్టుకున్న లోకేష్

2023 జనవరి 27వ తేదీన యువగళం పాదయాత్రలో లోకేష్..



- ప్రతి ఏటా 6,500 పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ.
- తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి కండీషన్లు లేకుండా రేషన్‌కార్డు, పెన్షన్లు.
- యూత్ మేనిఫెస్టో తీసుకువస్తాం.అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే డీఎస్సీ పెట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్ తీసుకొస్తాం. ఇంకా పలు హామీలు ఇచ్చారు.

తిరుపతిలో చంద్రబాబు, పవన్ ఇలా..



2024 మే 7వ తేదీన తిరుపతిలో పర్యటించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే..

- తిరుమల పవిత్రతను కాపాడుతాం. ఆలయాల వార్షిక ఆదాయం ఆధారంగా అర్చకులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలు వేతనం.
- పౌరోహిత్యాన్ని కులవృత్తిగా గుర్తిస్తాం.
- బ్రాహ్మణ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేస్తాం.
- తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు అన్ని ఆలయాల పాలకమండళ్లలో బ్రాహ్మణులను ట్రస్టు బోర్డులు సభ్యులుగా నియమిస్తాం.

పుంగనూరులో..

2024 మే 7వ తేదీన పుంగనూరులో పర్యటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.

- ఐటీ టవర్ ఏర్పాటుతో పాటు టెక్స్‌టైల్ పరిశ్రమలు నెలకొల్పుతాను.
- ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించి, విదేశీ విద్యను ప్రోత్సహిస్తాను.
- మసీదులకు ప్రతినెలా రూ.5వేలు ఆర్థిక సాయం అందిస్తా.

చిత్తూరులో చంద్రబాబు..



2024, మే 11 వతేదీన చిత్తూరు నగరంలోని మురకంబట్టు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో.. జిల్లా కేంద్రమైన చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి విద్యాహబ్‌గా మారుస్తాను.

- చిత్తూరులోనే ఐటీ టవర్ ఏర్పాటు, పలు పరిశ్రమలు తీసుకొస్తా.
- జిల్లాలోని ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి, చిత్తూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా.

బంగారుపాళెంలో డయాలసిస్ కేంద్రం



బంగారుపాళెంలో శుక్రవారం ప్రారంభం కానున్న డయాలసిస్ కేంద్రం

లోకేష్ బాబు యువగళం పాదయాత్ర బంగారుపాళెం చేరుకున్న సందర్భంగా వంద రోజులు పూర్తి కావడంతో అక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఓ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, హామీ ఇచ్చారు. నాడు ఇచ్చిన హామీని నేడు మంత్రి హోదాలో లోకేష్ బాబు ప్రారంభించనున్నారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి: అధికారం కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లెక్కలేనన్ని హామీలు ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రజాగళం, వారాహి, యువగళం పేరుతో ముగ్గురు నేతలు ఊరూ వాడా తిరుగుతూ అలవికాని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులకే హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఒకే ఒక హామీ తప్ప మిగిలిన ఏ ఒక్కటీ అమలు కాలేదు. ముఖ్యంగా మెగా డీఎస్సీని వంద రోజుల్లోనే తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని గొప్పగా ప్రకటించుకున్నారు. ఇకపోతే సూపర్ సిక్స్ గురించి ఊరూ వాడా ప్రచారం చేశారు. అభ్యర్థులు 'నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు' అంటూ ఇంటింటికీ వెళ్లి చెప్పారు. వంద రోజులు పూర్తయినా సూపర్ సిక్స్ ఊసేలేదు. మెగా డీఎస్సీ ప్రకటనకే తప్ప కార్యరూపం దాల్చలేదు. ఇలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీలు, అమలుపై సాక్షి ప్రత్యేక కథనం.

వంద పడకల ఆస్పత్రేదీ?

2023 ఏప్రిల్ 20న సత్యవేడు ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబు పలు హామీలు ఇచ్చారు.

- సత్యవేడులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధిచేస్తా.
- నియోజకవర్గ కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తా
- సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తా
- దాసుకుప్పం, సత్యవేడుకు బైపాస్ రోడ్డు నిర్మిస్తా

సీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా

2024 మార్చి 27లో పలమనేరు ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు హామీలు

- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే బాధ్యతను నేను తీసుకుంటున్నా.
- సూపర్ సిక్స్‌తో పాటు 50 ఏళ్లకే పింఛను ఇస్తాను.

తెలుగుగంగ కాలువ ద్వారా సాగునీరేదీ?

2023 జూన్ 26న యువగళం పాదయాత్ర చిట్టమూరు మండలం ఆరవపాళెనికి చేరుకుంది. 1800 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుగంగ కాలువకు బ్రాంచ్ కెనాల్ ఏర్పాటు చేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

తాగునీళ్లెప్పడిస్తారు?

2023 ఫిబ్రవరి 19న యువగళం పాదయాత్ర 300 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఉన్న 13 గ్రామాలకు రక్షిత మంచినీటిని పథకం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.



తొండమాన్‌పురం వద్ద వేసిన శిలాఫలకం

చిత్తూరు యువగళం పాదయాత్రలో..

2023, ఫిబ్రవరి 6 : టీడీపీ ఎస్సీ విభాగంలో ముఖాముఖి నిర్వహించిన కార్యక్రమంలో.. అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తాం. ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు.

ఫిబ్రవరి 7 : చిత్తూరులో నిర్వహించిన యువగళం బహిరంగ సభలో.. చిత్తూరులో యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్ మానుఫాక్చర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం.
ప్రజల దాహార్తిని తీర్చడానికి శాశ్వత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం

డిగ్రీ కళాశాల ఎక్కడ లోకేష్ గారూ..

లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 2023 ఫిబ్రవరి 11న జీడీ నియోజకవర్గం కార్వేటినగరం మండలం కత్తిరిపల్లి వద్ద 200 కి.మీ పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా లోకేష్ అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో గంగాధరనెల్లూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. వంద రోజులు పూర్తి అయినా ఎలాంటి చర్యలు లేవు. విద్యార్థులు చిత్తూరు, పుత్తూరుకు వెళ్లాల్సి వస్తోంది.



కార్వేటినగరం కత్తెరపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

హ్యాండ్ లూమ్‌కి హ్యాండిస్తారా?

2023 జూన్ 21న డక్కిలి మండల కేంద్రానికి చేరుకున్న యువగళం పాదయాత్ర 1700 కి.మీ పూర్తి చేసుకుంది. వెంకటగిరి చేనేతకు ప్రసిద్ధి కావడంతో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతంలో హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ పార్కు స్థాపిస్తామని లోకేష్ బాబు హామీ ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వ ప్రయత్నాలేవీ కనిపించలేదు.



డక్కిలి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

నేడు వార్డు సచివాలయాల కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వార్డు సచివాలయాల కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కార్యదర్శులు ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో వార్డు అడ్మిన్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, అమినిటీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, అంతర్ జిల్లా బదిలీల కోసం ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటుచేశామని, అధికారులు, సిబ్బందిని నియమించినట్టు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,690 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,086 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.18 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

ఆకట్టుకున్న జానపద నృత్యాలు

- పీవీకేఎన్‌లో ఘనంగా యువజన వారోత్సవాలు





జానపద నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సెట్విన్, పీవీకేఎన్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో యువజన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు జానపద నృత్యాలు, జానపద గీతాలాపన, కథారచనలు, పెయింటింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. జానపదం గ్రూప్ విభాగంలో సునీల్ గ్రూప్ మొదటి బహుమతి, మేఘన గ్రూపు రెండవ బహుమతి పొందారు. జానపదం సోలో విభాగంలో రమ్య మొదటి, గాయత్రి రెండవ, జానపద గీతాలాపనలో (గ్రూపు) షాహినా మొదటి, గణేష్ రెండవ బహుమతులు కై వసం చేసుకున్నారు. పెయింటింగ్‌లో పీవీకేఎన్ కళాశాల విద్యార్థిని అమృత మొదటి, నగరికి చెందిన హేమావతి రెండవ బహుమతులు పొందారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, మేనేజర్ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేరుశనగ పంట పరిశీలన



మొరం వద్ద వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో వర్షాభావానికి తోడు ఎండలు ఎక్కువగా కాస్తుండడంతో వేరుశనగ పంట ఎండుతోంది. ఈ క్రమంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై 'ఎండార్పణం' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ నాగపద్మిని, స్థానిక వ్యవసాయాధికారి సంధ్య గురువారం మొరం, నక్కపల్లెలో పర్యటించి పంటలను పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు లీటర్ నీటికి 20 గ్రాముల యూరియాను కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా పంటకు బెట్టను తట్టుకునే శక్తి వస్తుందని తెలిపారు. అలాగే ఈ–పంటలో భాగంగా రైతులు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. పంట నష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.40 వేల విరాళం



ఆర్డీవోకు చెక్కును అందజేస్తున్న దివ్యధామం నిర్వాహకులు

పలమనేరు: విజయవాడ వరద బాధితుల కోసం పలమనేరు పట్టణానికి చెందిన గోవింద దివ్యధామం నిర్వాహకులు సీఎం సహాయ నిధికి రూ.40 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు వారు గురువారం చెక్కును పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో క్రిష్ణమూర్తి రెడ్డి, మిలటరీ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



చంద్రశేఖర్‌రెడ్డి

గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ బండ మీద జరావారిపల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి మూడు రోజులుగా కనిపించ లేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో వారు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లినట్టు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 7019207414 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

ప్రైవేటు పరం చేయొద్దు



పేదలకు మంచి వైద్యం అందాలంటే అది ప్రభుత్వ వ్యవస్థతోనే సాధ్యమవుతుంది. అక్కడ వైద్యం అందకపోతే ప్రశ్నించే గొంతు ఉంటుంది. అదే ప్రైవేటుకు ఇస్తే.. ఆ గొంతుకు తాళం పడినట్టు అవుతుంది. ప్రధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే పేద పిల్లలకు వైద్య విద్య దూరమవుతుంది. వాళ్ల ఆశలు ఆవిరవుతాయి. మాలాంటి తల్లిదండ్రుల కల కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వ కళాశాలలుంటే ఫీజుల భారం ఉండదు. అదే ప్రైవేటు పరం చేస్తే వారు అడిగినంత ఇచ్చుకుని సీట్లు కొనుక్కోవాల్సి వస్తుంది. మా పిల్లలకు మెడికల్ విద్యను దూరం చేయొద్దని వేడుకుంటున్నాం.

– భానుప్రకాష్‌రెడ్డి, చిత్తూరు



విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఏ మాత్రం సరి కాదు. గత ప్రభుత్వం పేదల కోసం 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చింది. ఐదింటిలో అడ్మిషన్లు చేపట్టింది. ఇప్పుడెందుకు ఆ కళాశాలలను ప్రైవేట్‌కు ఇచ్చేయాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదు. వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటే బాగుంటుంది. పేద విద్యార్థుల వైద్యవిద్యకు ప్రభుత్వం చేయూతనివ్వాలి.

– దేవిక, చిత్తూరు

పంచాయతీలకు నూతన గ్రేడ్లు?

చిత్తూరు జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో జనాభాతోపాటు ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ గ్రేడ్లలో వ్యత్యాసం ఉంది. వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పీఆర్ అండ్ ఆర్డీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఇప్పటికే జిల్లాల నుంచి 2011 జనాభా, గత మూడేళ్లుగా వస్తున్న తలసరి ఆదాయ వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ (సీపీఆర్)కు పంపించారు. త్వరలోనే గ్రామ పంచాయతీలకు నూతన గ్రేడ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



జిల్లా పంచాయతీ కార్యాలయం

- రాష్ట్ర అధికారులకు చేరిన నివేదిక
- గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల నియామకం
- బదిలీల్లో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సూచనలు అమలు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ గ్రేడ్లలో వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న గ్రేడ్లు రెండు దశాబ్దాల క్రితం నాటి ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రస్తుతం గ్రామాల్లో జనాభా, ఆదాయం వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. మున్సిపాలిటీల సమీపంలో ఉన్న పలు పంచాయతీలకు వివిధ రూపాల్లో ఆదాయ వనరులు పెరిగాయి. పలు రకాల పన్నుల ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తోంది. గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లోనూ మార్పులు ఉన్నాయి. కొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీలో పనిచేస్తున్నారు. మరికొందరు పనిభారం తగ్గించుకునేందుకు ఎక్కువ గ్రేడ్ ఉన్నప్పటికీ తక్కువ గ్రేడ్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నారు.

ఆదాయం ప్రకారం మార్పులు

కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయానికి అనుగుణంగా పంచాయతీల గ్రేడ్లు మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా మారితే కార్యదర్శులకు తప్పనిసరిగా స్థానచలనం కలుగుతుంది. ఆదాయానికి అనుగుణంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అర్హులైన కార్యదర్శులను నియమించే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో కచ్చితంగా నిబంధనలను అమలుచేయాలని అధికారులు యోచిస్తున్నారు. కార్యదర్శి గ్రేడ్‌ను బట్టి నియమించాలని ఇటీవల డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాల విడుదలలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కచ్చితంగా గ్రేడ్లను అనుసరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ మొత్తం కొద్ది రోజుల్లోనే పూర్తవుతుందని చెబుతున్నారు.

జిల్లాలోని పంచాయతీల వివరాలు

జిల్లాలో మొత్తం 697 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రూ.5 లక్షలకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి(గ్రేడ్–1) 43, రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలలోపు ఆదాయం కలిగినవి (గ్రేడ్–2) 57, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (గ్రేడ్–3) 108, రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం ఉన్నవి (గ్రేడ్–4) 242 ఉన్నాయి. గ్రేడ్–1 కార్యదర్శులు 19 మంది, గ్రేడ్–2 వారు ఆరుగురు, గ్రేడ్–3 కార్యదర్శులు 105 మంది, గ్రేడ్ 4 వారు 185 మంది, గ్రేడ్ 5 ఉన్న వారు 270 మంది మొత్తం 585 మంది పని చేస్తున్నారు.

వివరాలు అందజేశాం

పంచాయతీల వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ కోరడంతో జిల్లాకు సంబంధించినవి అందజేశాం. అందులో ఆయా గ్రామాల జనాభా, ఆదాయం వివరాలు పొందుపరిచాం. గ్రేడ్ ఆధారంగానే ఇక నుంచి కార్యదర్శుల బదిలీలు జరిగే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ నిబంధనలు కూడా అలాగే ఉన్నాయి.

– లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

యాళి వాహనంపై వరసిద్ధుని చిద్విలాసం



యాళి వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధి వినాయక స్వామి

- ఘనంగా కొనసాగుతున్న కాణిపాకం ప్రత్యేక బ్రహ్మోత్సవాలు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సిద్ధి బుద్ధి వినాయకస్వామి గురువారం యాళి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు చేసి ఆభరణాలు అలంకరించారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి యాళి వాహనంపై కొలువుదీర్చారు. తర్వాత మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని స్మరిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విమానోత్సవం

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం విమానోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేస్తామని, రాత్రి స్వామి వారు విమానంలో ఊరేగుతారని పేర్కొన్నారు.

వరసిద్ధునికి మహానందీశ్వరుడి పట్టువస్త్రాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామికి గురువారం మహానందిలోని శ్రీమహానందీశ్వర స్వామి ఆలయ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో శ్రీనివాసరెడ్డి ఆలయ అతిథి గృహం నుంచి ఆలయంలోకి చేరుకుని పట్టువస్త్రాలను ఆలయ అర్చకులకు అందజేశారు. వారికి అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు.

స్వామిని దర్శించుకున్న డీఎఫ్‌వో

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కల్పవృక్ష వాహన సేవలో భాగంగా అటవీశాఖ,దేవస్థాన ఆధ్వర్యంలో వృక్ష ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు డీఎఫ్‌వో పేర్కొన్నారు.

రేపు సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రధాన దేవాలయం కల్యాణ వేదిక వద్ద సంకటహర గణపతి వ్రతాన్ని చేపడతామని పేర్కొన్నారు. రాత్రికి స్వర్ణ రథోత్సవం ఉంటుందని వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో తాత, మనవడి మృతి



మృతి చెందిన నాగయ్య



రాజ్‌కుమార్

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచిలో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో తాత, మనవడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. గుండ్లకట్టమంచి దళితవాడకు చెందిన నాగయ్య (73) హాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఇంట్లో వున్న ఇనుప ఊయలపై కుర్చున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు ఊయలను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ విషయాన్ని గుర్తించిన మనవడు రాజ్‌కుమార్(22) (నాగయ్య కుమారుడు గోవిందయ్య కుమారుడు) తాతను రక్షించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతనికీ షాక్ కొట్టింది. ఇద్దరూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వారిని కుటుంబ సభ్యులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు వారు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాత, మనవడి మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాజ్‌కుమార్ బెంగళూరులో ఓ కంపెనీలో మూడు నెలల క్రితమే ఉద్యోగంలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

గంగాధర నెల్లూరు: మండలంలోని గొల్లపల్లెలో తమిళనాడు బియ్యం అక్రమంగా స్టాకు ఉంచిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న కథనం మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు గొల్లపల్లెలో దాడులు చేశారు. ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన సూరి, అదే మండలానికి చెందిన పుల్లూరు క్రాస్‌కు చెందిన మురుగన్, గంగాధర నెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ గొల్లపల్లెకు చెందిన లోకనాథరెడ్డి, తమిళనాడు రాష్ట్రం అమ్మియార్ కుప్పానికి చెందిన అశోక్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారికి 41 నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో బియ్యం రవాణాకు వాడిన ఓమిని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- ఈ నెల 23న మండల స్థాయి సమావేశాలు
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం అమరావతి నుంచి కలెక్టర్, జిల్లా అధికారులతో స్వర్ణ ఆంధ్రా– 2047 అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో వ్యవసాయ అనుబంధ ఆధారిత, పరిశ్రమల క్లస్టర్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రణాళికల రూపకల్పనకు ఈనెల 23న మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30వ తేదీలోపు నివేదికను అందజేయాలని మండల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అనంతరం జిల్లా స్థాయిలో నివేదికలను సమీకృతం చేసి అక్టోబర్ 15వ తేదీలోపు ప్రణాళికలు సిద్ధం చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. 2024 నుంచి 2029 వరకు ఒక విజన్‌తో నివేదిక సిద్ధం చేయిస్తున్నట్లు వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి శాఖా పరిధిలో సాధించాల్సిన లక్ష్యాలను నివేదికల రూపంలో సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, జెడ్పీ సీఈవో గ్లోరియా, సీపీవో సాంబశివారెడ్డి, డీఈవో దేవరాజు, డీపీవో లక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ఇరుముడుల చెల్లింపు

కాణిపాకం: గణేష్ దీక్ష చేపట్టిన భక్తులు గురువారం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఇరుముడులు చెల్లించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని సూర్య సత్యనారాయణ మూర్తి శర్మ ఆధ్వర్యంలో 50 మంది భక్తులు దీక్ష చేపట్టి కాణిపాకం వచ్చారు. వారికి ఆలయ అధికారులు ఇరుముడుల మండపం వద్ద ప్రత్యేక ఏర్పాటు చేసి స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి కమలనాథ ఆచారి గురువారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లి చూడగా హుండీ చోరీకి గురైనట్టు గుర్తించి పెద్ద పంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగులు ఆలయం గేటు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి హుండీని అపహరించుకుని పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఆలయం వద్ద పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉపాధిలో యథేచ్ఛగా దోపిడీ

అధికారం అండతో కూటమి నాయకులు చెలరేగిపోతున్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ వారిని నియమించుకుని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. కూలీల స్థానంలో యంత్రాలతో పనులు చేస్తున్నారు. కూలీలు పనిచేయకపోయినా చేసినట్టు రికార్డులు సృష్టించి ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. అర్హులైన కూలీలకు పనులు కల్పించడం లేదు. దీంతో వారు ఇతర పట్టణాలకు వలస బాట పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు దారితీస్తోంది.



వేపనపల్లి చెరువులో జేసీబీతో చేస్తున్న ఫిష్ పాండ్ పనులు

- జేసీబీలతో ఫిష్ పాండ్ పనులు
- పట్టించుకోని అధికారులు

పూతలపట్టు: పూతలపట్టు మండలంలోని వేపనపల్లిలోని కుళ్లప్పరెడ్డి చెరువులో ఉపాధి హామీ కింద ఫిష్‌పాండ్ పనులకు రూ.5 లక్షలు, ఒంటిళ్ల నుంచి వేపనపల్లి వరకు రోడ్డు పక్కన మొక్కల పెంపకానికి రూ.6 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులను స్వాహా చేయడానికి కూటమి నేతలు భావించారు. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అనేక ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకున్నారు. ఫిష్ పాండ్ పనులను జేసీబీలతో చేస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌ను మార్చేసి తప్పుడు అటెండెన్స్(కూలీలు హాజరు)ను నమోదు చేస్తున్నారు. కూలీలు పనిచేయకుండానే పని చేసినట్లు సృష్టించి బిల్లులు పెడుతున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్నారు. వావిల్ తోటలోని తాటిచెరువు, ఎస్టీ కాలనీ వద్దనున్న చెరువు, పోటు కనుమ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

కూలీల వలస బాట

గతంలో అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించేవారు. వేతనాలు కూడా సకాలంలో అందేవి. దీంతో కూలీలు కుటుంబాలను పోషించుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి కూలీల పరిస్థితి తలకిందులైంది. అర్హులకు పనులు కల్పించడం లేదు. పనులు కల్పించాలని కోరుతున్నా ఫలితం లేదు. యంత్రాలతో పనులు చేస్తూ బినామీ పేర్లతో బిల్లులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో స్థానికంగా పనులు లేక కూలీలు పట్టణాలకు వలస బాట పడుతున్నారు. ఉపాధి హామీలో అక్రమాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. తమకు పనులు కల్పించలేదని ఫిర్యాదు చేయడానికి ఎంపీడీవో కార్యాలయానికి వెళితే తిరస్కరిస్తున్నారని కూలీలు వాపోతున్నారు. కూటమి నేతల ఒత్తిడి మేరకే ఇదంతా జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూతలపట్టు మండలంలో ఉపాధి హామీలో జరుగుతున్న అక్రమాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

మొగిలి ఘాట్ ప్రమాద వివరాలు ఇవ్వండి

– ఏపీ ప్రధాన కార్యదర్శికి సుప్రీం కోర్టు రహదారి భద్రత కమిటీనోటీసులు

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై పూర్తి స్థాయిలో వివరాలను అందజేయాలని సుప్రీం కోర్టు రహదారి భద్రత కమిటీ ఆదేశించింది. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్‌కి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 13న ఆర్టీసీ బస్సును కంటైనరు ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, 33 మంది గాయపడినట్లు కమిటీ నివేదిక ఇచ్చింది. ట్రాఫిక్ చట్టాలను అమలు చేయకపోవడం, అతివేగం తదితరాలతో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రమాదంపై పూర్తి స్థాయి నివేదికను అక్టోబరు 20వ తేదీ లోపు అందజేయాలని ఆదేశించింది.